

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- ఖమ్మం కలెక్టరేట్‌లో 11పైలెట్ ప్రాజెక్టు పాఠశాలలపై సమీక్ష



సమీక్షిస్తున్న ఆకునూరి మురళి

6



తేలిన ఎంపీటీసీల లెక్క

- ఖమ్మంలో 283, భద్రాద్రిలో 233 ప్రాదేశిక నియోజకవర్గాలు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేయగా.. అందులో ఉమ్మడిజిల్లా మండల ప్రాదేశిక నియోజకవర్గాల లెక్క కూడా తేలింది. ఖమ్మం జిల్లాలో 283, భద్రాద్రి జిల్లాలో 233 ఎంపీటీసీ స్థానాలుగా ఖరారయ్యాయి. ప్రతీ మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా, వాటిని పునర్విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈనెల 8న అధికారులు ముసాయిదా జాబితా వెల్లడించారు. వాటిపై రెండురోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించారు. అనంతరం వాటిని పరిష్కరిస్తూ ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు.

● ఖమ్మం జిల్లాలో 2019లో 20 జడ్పీటీసీ, 289ఎంపీటీసీ స్థానాలున్నాయి. తరువాత ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా పంచాయతీలో కొన్ని గ్రామపంచాయతీలతో ఏదులాపురం మునిసిపాలిటీ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముసాయిదా జాబితాలో అప్పట్లో 288స్థానాలుగా ప్రకటించారు. తాజాగా కల్లూరు మండల పరిషత్‌లో 18ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. వీటిలో విలీనమైన పంచాయతీల్లో ఎంపీటీసీ స్థానాలను మినహాయిస్తే (మిగతా 6వ పేజీలో)



ఖమ్మం బీసీ గురుకుల ఆర్సీవో కార్యాలయంలో ఇతర జిల్లాల విద్యార్థుల తల్లిదండ్రులు

పేద, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసి.. అందులో ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పిస్తోంది. కానీ కొందరు అధికారులు సొంత నిర్ణయాలతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వం కేటాయించిన ప్రాంతాల్లో కాకుండా అధికారులు వారిని అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో గురుకులాలను ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు దూరాభారం పెంచుతున్నారు. ఒకే ప్రాంగణంలో రెండు, మూడు గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో గురుకులాల్లో ప్రవేశాలు జిల్లాల వారీగా కాకుండా ఒక జిల్లా విద్యార్థులను మరో జిల్లాకు కేటాయించారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు నానా అగచాట్లు పడుతున్నారు. జిల్లాలోని ఒక మండలం నుంచి మరో మండలానికి వెళ్లాలంటేనే విద్యార్థులు ఆలోచించాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఏకంగా జిల్లాలే మార్చేస్తుండడంతో.. అంతా దూరం వెళ్లాలో.. లేదో తెలియక విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులూ దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

గురుకులం.. దూరం.. భారం!

- సీట్లు వచ్చినా.. విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఒక జిల్లా స్టూడెంట్‌కు మరో జిల్లాలో సీటు
- వ్యయ ప్రయాసలకోర్చుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఒకే ప్రాంగణంలో రెండు నుంచి మూడు గురుకులాల నిర్వహణ
- విద్యార్థులకు కనీస వసతులూ కరువే..
- సిఫారసు లేఖలతో ఆర్‌సీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు మొత్తం 24 బీసీ గురుకులాలు ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 13, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11 గురుకులాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 9600 సీట్లు ఉండగా.. జూలై 15 నాటికి 9547 సీట్లు భర్తీ అయ్యాయి. మరో 53 సీట్లు ఖాళీగా ఉన్నట్లు బీసీ గురుకుల అధికారులు తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి అధికంగా వరంగల్ జిల్లా విద్యార్థులకు ఖమ్మం జిల్లాలో సీట్లు కేటాయించారు. ఖమ్మం జిల్లా విద్యార్థులను మరో జిల్లాకు కేటాయించారు. ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థులను రాష్ట్రంలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, పెద్దపల్లి, వరంగల్, తదితర జిల్లాలకు, అక్కడి విద్యార్థులను ఖమ్మం జిల్లాకు కేటాయించారు. దీంతో అక్కడ, ఇక్కడ విద్యార్థుల తల్లితండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమి లేక సంబంధిత గురుకులాల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. బీసీ గురుకులాలలో సీట్లు వచ్చినా తిప్పలు తప్పటం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తమకు తమ జిల్లా పరిధిలోని గురుకులాలలో సీట్లు కేటాయించాలని కోరుతున్నారు. కొందరు ఎంపీ, ఎంఎల్‌ఏ, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్లను తీసుకొచ్చి మరీ ట్రాన్స్‌ఫర్లు అడుగుతున్నారు. సీట్లను బట్టి అధికారులు సిఫార్సు లెటర్లను అనుమతిస్తున్నారు.

గురుకులాల్లో చేరేందుకు పెరుగుతున్న పోటీ.. కానీ..!?

సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాల్లో చేరేందుకు గతంలో విద్యార్థులు అంతగా ఆసక్తి చూపించలేదు. అయితే ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తుండడంతో ఏటేటా పోటీ పెరుగుతోంది. గురుకులాల్లో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు కార్పొరేట్ స్థాయి బోధన అందుతోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు బోధిస్తుండగా.. చదువుతోనే సరిపెట్టకుండా విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడంపైనా దృష్టి సారిస్తున్నారు. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తుండడంతో పలువురు విద్యార్థులు రాష్ట్ర (మిగతా 6వ పేజీలో)



మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ చెక్కును అందజేస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, విజయ్‌బాబు

అన్ని పథకాలు మహిళలకే..

- కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 'పేట' నియోజకవర్గ ఇందిరా మహిళా శక్తి సంబురాలకు హాజరు

7



మధిర పట్టణంలో నిర్మించిన మ్యాన్‌హోల్‌లు

అన్నీ భూగర్భంలోనే!

- మధిరలో రూ.128కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం
- శరవేగంగా సాగుతున్న పనులు
- విద్యుత్ లైన్లకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు
- రూ.40 కోట్లతో ప్రతిపాదనలు
- మరో రెండు నెలల్లో పనుల ప్రారంభానికి అవకాశం

6



ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో రోగుల రద్దీ ఇలా...

జ్వరం.. జలుబు..!

- ప్రజలను వణికిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి
- కిటకిటలాడుతున్న వార్డులు
- రోజుకు 1500లకు పైనే ఓపీ..

6



ప్రసంగిస్తున్న ప్రదీప్ సింగ్ ఠాకూర్

ఇల్లెందులో మాస్‌లైన్ ఆధ్వర్యంలో ప్రదర్శన

నరమేధం సాగిస్తున్న బీజేపీ సర్కార్

- మాస్ లైన్ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్ సింగ్ ఠాకూర్, పోటు రంగారావు
- భద్రాద్రి జిల్లా ఇల్లెందులో కదంతొక్కిన ఎర్ర దండు
- మాస్‌లైన్ అమరుల స్థూపాల ఆవిష్కరణ

6

నేడు వైరాలో ఉమ్మడి జిల్లా గిరిజన సంఘం సమావేశం

వైరా, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మంజిల్లా గిరిజన సంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో నిర్వహిస్తున్నామని ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాణోతు బాలాజీ, భూక్యా వీరభద్రం తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్ హాజరయ్యే ఈ సమావేశంలో గిరిజన సమస్యలు, విద్యా, వైద్యం, పోడు భూముల సమస్య, తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించటం, ఖమ్మంజిల్లా గిరిజనాభివృద్ధికి ఐటీడీఏ ఏర్పాటు లాంటి అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్యకార్యకర్తలు తరలిరావాలన్నారు.

సర్వేలతోనే సరి.. పరిష్కారమేది మరి?

- ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా.. దరిచేరని '133' భూ సమస్య
- ఇబ్బందులు పడుతున్న యజమానులు



సర్వే నెంబరు 133లోని భూముల్లో సాగులో ఉన్న ఆయిల్‌పాం పంట

సత్తుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నాయి.. అధికారులు మారుతున్నారు. ప్రజాప్రతినిధులు మారుతున్నారు. అయినా తమ తల రాతలు మాత్రం మారటం లేదని సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భూ యజమానులు వాపోతున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 133 సర్వే నెంబర్ భూముల సమస్యలు పరిష్కరించాలని సుదీర్ఘకాలంగా కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. పరిష్కరిస్తామని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండల అధికారులు ప్రకటించటం తప్ప పరిష్కారానికి నోచటం లేదు. సర్వేల పేరుతో కాల యాపన తప్ప తమ భూములకు సంబంధించి హక్కులు శాశ్వతంగా లభించటం లేదని, ఏళ్ల తరబడి తమ భూముల విషయంలో అభద్రతాభావంతో కాలం వెళ్లదీస్తున్నామని వాపోతున్నారు.

133 సర్వే నెంబర్ పూర్వాపరాలు

బేతుపల్లి రెవెన్యూలో 133 సర్వే నెంబర్‌లో ఖాస్రా పహణీ ప్రకారం మొత్తం 3,090 ఎకరాల విస్తీర్ణం ఉంది. కానీ గతంలో మాన్యువల్ పహణీ అమల్లో ఉన్నప్పుడు దాదాపు అంతకు (మిగతా 6వ పేజీలో)



పోడు సాగుదారుల మధ్య ఘర్షణ దృశ్యం

ప్లాంటేషన్‌లో పోడు వివాదం

- అటవీశాఖ సిబ్బంది, సాగుదారుల మధ్య ఘర్షణ
- సముదాయించిన పోలీసు సిబ్బంది

కారేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కారేపల్లి మండల పరిధిలోని మాణిక్యారం, ఎర్రబోడు, ఊటవాగు సమీపంలోని ప్లాంటేషన్‌లో పోడుదారులు, ఫారెస్టు అధికారుల మధ్య బుధవారం వివాదం జరిగింది. అదికాస్తా తోపులాట, ఘర్షణకు దారితీసింది. పోడు సాగుదారులు వేసుకున్న గుడిసెలను తొలగించే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బి.గోపి సిబ్బందితో అక్కడికి వెళ్లి ఇరువర్గాలవారిని సముదాయించారు. ఇరువర్గాలకు చెందిన ఫారెస్టు, పోడుదారులు సమస్యను జటిలం కాకుండా చూసుకోవాలన్నారు. దాంతో ఇరువర్గాల వారు శాంతించారు.

పైరవీల జోరు!

- విద్యాశాఖలో పోటాపోటీగా 'లాబీయింగ్'
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- డిప్యూటేషన్ల కోసం జిల్లాలో 493 మంది సర్‌ప్లస్ పోస్టులు
- 305 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు
- ఇంకా మిగులు ఉపాధ్యాయుల సంఖ్య 187



కొత్తగూడెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పి సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన జిల్లా విద్యాశాఖలో పైరవీల జోరు కొనసాగుతోంది. జిల్లాలో మిగులు ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేయాల్సిందిగా విద్యా సంవత్సరం ఆరంభంలోనే రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే జిల్లాలోని 23 మండలాల్లో ఏ ఏ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్యతో పాటు ఏ ఏ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు, ఏఏ పాఠశాలలకు ఉపాధ్యాయుల అవసరాలకు సంబంధించిన వివరాలు అందజేయాల్సిందిగా మండల విద్యాశాఖాధికారులను జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ చేసి నెల రోజులు దాటినప్పటికీ.. ఇప్పటికీ మెజార్టీ మండలాల నుంచి పూర్తి స్థాయిలో సమాచారం రాకపోవడంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జూలై రెండో వారానికి జిల్లాలో డిప్యూటేషన్లు పూర్తి చేయాలని సర్‌ప్లస్ ఉపాధ్యాయులు 493 మంది (అదనంగా) ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 305మంది ఉపాధ్యాయులను 23 మండలాల్లో సర్దుబాటు చేయనున్నారు. ఇంకా 187మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని పలు ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. జిల్లాలోని చాలా పాఠశాలల్లో 100మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరి హాజరు శాతం కూడా 70-80శాతం మాత్రమే ఉందని సమాచారం. ఈ క్రమంలో తమ ఇళ్లకు, గ్రామాలకు దగ్గరగా ఉండే పాఠశాలలకు రావాలని ఉపాధ్యాయులు పోటీ పడుతున్నారు. ఇందులో భాగంగానే పలువురు ఉపాధ్యాయులు పైరవీల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

● **డిప్యూటేషన్ల కోసం పోటీపోటీగా పైరవీలు**

ఏజెన్సీ ప్రాంత పాఠశాలల నుంచి మైదాన ప్రాంత పాఠశాలలకు రావాల్సిన డిప్యూటేషన్ల కోసం పలువురు ఉపాధ్యాయులు పోటీపోటీగా పైరవీలు చేస్తున్నారు. మరి కొందరు ఉపాధ్యాయులు అయితే ఏకంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల దగ్గరకు వెళ్లి తమకు కావాల్సిన 'సర్దుబాటు' కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఫలితంగా ఈ పైరవీలు కాస్త జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారాయి. మరో వైపు.. డిప్యూటేషన్ల కోసం ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ అధికారులు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఏఏ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు ఉన్నారో.. వారిని అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేయాలని భావించారు. అయితే ఏజన్సీ ప్రాంతాల నుంచి అధిక స్థాయిలో మైదాన ప్రాంతాలకు (మిగతా 6వ పేజీలో)

అన్నీ భూగర్భంలోనే!


సీసీ రోడ్డును మిషన్‌తో కటింగ్ చేస్తున్న దృశ్యం

- మధిరలో రూ.128కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం
- శరవేగంగా సాగుతున్న పనులు
- విద్యుత్ లైన్లకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు
- రూ.40 కోట్లతో ప్రతిపాదనలు
- మరో రెండు నెలల్లో పనుల ప్రారంభానికి అవకాశం

మధిరటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మరికొన్ని నెలల్లో మధిర పట్టణ రూపురేఖలు మారనున్నాయి. పట్టణ ప్రజలు మురుగు అనేది కనిపించకుండా.. వాసన అనేది రాకుండా ఉండేలా భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను నిర్మిస్తున్నారు. ఇదే సమయంలో ఎలాంటి విపత్తులు సంభవించినా.. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకుగాను విద్యుత్ లైన్లను కూడా అండర్ గ్రౌండ్‌లోనే వేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన డిజైన్లు, ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి.


పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు

ఉమ్మడి రాష్ట్రంలోనే మంజూరు..

మధిరలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం నాడు ఉమ్మడి రాష్ట్రంలోనే.. అప్పటి డిప్యూటీ స్పీకర్ హోదాలో మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేయించారు. కానీ రాష్ట్ర విభజన, తదనంతరం ఏర్పడిన ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో అది మరుగున పడింది. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్క దీనిపై దృష్టి పెట్టారు. మధిర అభివృద్ధిపై అధికారులతో ఏర్పాటు చేసిన మొట్టమొదటి సమావేశంలోనే మధిరలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించి.. అనంతరం రూ.128 కోట్లతో పనులు మంజూరు చేయించారు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం శంకుస్థాపన చేయగా.. ఆ పనులు ప్రారంభమై శరవేగంగా సాగుతున్నాయి. పట్టణంతోపాటు మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల్లోని 6,638 ఇళ్లకు లబ్ధిచేకూరేలా వంద కిలోమీటర్ల పైప్‌లైన్‌తో పాటు 2,665 మ్యాన్ హోల్‌లు నిర్మించడమే కాకుండా.. మురుగు నీటి శుద్ధికి నాలుగు ఎస్‌టీపీ ప్లాంట్లను నిర్మించనున్నారు. సీసీ రోడ్లు దెబ్బతినకుండా బాక్స్ కటింగ్ మిషన్‌తో కట్‌చేసి తరువాత ఎక్స్‌కవేటర్‌తో తవ్వి ఆరు అంగుళాల నుంచి మూడు అడుగుల వెడల్పు కలిగిన పైపులను వేస్తున్నారు. ప్రతీ ఇంటి నుంచి మురుగునీరు అందులోకి వచ్చేలా ఇన్‌స్పెక్షన్ చాంబర్లు పెడుతున్నారు. వాన నీరు పోయేందుకు ఇంటి ముందు ఉన్న ఓపెన్ డ్రెయిన్‌కు ఇళ్ల యజమానులు పైపులు వేసుకోవాల్సి ఉంటుంది. మధిర, జిలుగుమాడు నుంచి వచ్చే మురుగునీటిని 5 ఎంఎల్‌డీ కెపాసిటీతో రాయపట్నం బ్రిడ్జి వద్ద నిర్మించే ఎస్‌టీపీ ప్లాంట్‌కు కలపనున్నారు. విలీన గ్రామాలైన మడుపల్లిలో 0.9 ఎంఎల్‌డీ, ఇల్లెందులపాడులో 0.5 ఎంఎల్‌డీ, అంబారుపేటలో 0.4 ఎంఎల్‌డీ కెపాసిటీ కలిగిన ఎస్‌టీపీ ప్లాంట్లు నిర్మించనున్నారు. ఎస్‌టీపీలల్లో శుద్ధి చేసిన నీటిని వ్యవసాయ అవసరాలకు కానీ మునిసిపాలిటీలో నాటిన మొక్కల పెంపకానికి వినియోగించి మిగులు నీటిని నదిలోకి కానీ కాలువల్లోకి కానీ కలపనున్నారు.


డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి(ఫైల్)

విద్యుత్ లైన్లూ భూమిలోనే..

ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా.. మధిర పట్టణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విద్యుత్ లైన్లను భూమిలో నుంచి ఏర్పాటు చేయించాలని తలచిన డిప్యూటీ సీఎం తన చేతిలోనే విద్యుత్ శాఖ ఉండటంతో భూగర్భంలో విద్యుత్ లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో ఆత్కూర్ సెంటర్ నుంచి నందిగామ బైపాస్ రోడ్డు వరకు అలాగే ఆర్వీ కాంప్లెక్స్ నుంచి బస్టాండ్ వరకు లైన్లు నిర్మించేందుకు డిజైన్లు రూపొందించి 18 కి.మీటర్లు 11 కేవీ కేబుల్, 12 కి.మీటర్లు ఎల్.టీ కెబుల్ ఏర్పాటుకు రూ.40 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత నెల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి విద్యుత్‌లైన్లు నిర్మించే ప్రదేశాలను పరిశీలించారు. ఇక ఈ అంచనాలన్నీ పూర్తయి పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని మరో రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ప్రజలు సహకరించాలి

నరేష్‌రెడ్డి, మునిసిపల్ డీఈ

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపులు వేసేందుకు మధిర పట్టణంలో ఎనిమిది బృందాలతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి, రోడ్డు మధ్యలో తవ్వటం వల్ల ప్రజలకు కొంత అసౌకర్యం ఉంటుంది సహకరించాలి. పనులు పూర్తయ్యాక పట్టణంలో మురుగు వాసన అనేదే ఉండదు. అంటువ్యాధులకు అవకాశం ఉండదు. ప్రజలు తమ ఇళ్లలోని వంటగది, బాత్‌రూం నీటిని మాత్రమే పైప్‌లైన్ ద్వారా ఇన్‌స్పెక్షన్ చాంబర్‌లో కలుపుకోవాలి. వాననీటిని ఈ చాంబర్‌లో కాకుండా.. బయట ఉన్న ఓపెన్ డ్రెయిన్‌లో కలుపుకోవాలి.

కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

అధికారులకు డైరెక్టర్ (పా) ఆదేశం


వీడియోకాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ (పా) గౌతమ్‌పోట్రు

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్‌పోట్రు అధికారులను ఆదేశించారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి వివిధ ఏరియాలకు సంబంధించిన పర్సనల్ డిపార్టుమెంట్, హెచ్‌వోడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించే విధంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని, క్వార్టర్స్ వంటి అంశాలపై ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. గైర్హాజరయ్యే కార్మికులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎంలు కవితానాయుడు, బెనడిక్ నికోలస్, జీవీ.కిరణ్‌కుమార్, ఏజే.మురళీధర్‌రావు, ఏజీఎం రాజేంద్రప్రసాద్, డీజీఎం అజయ్ కుమార్, నారాయణరావులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో డ్రాపవుట్స్ పెరిగే ప్రమాదం

విద్యాహక్కు చట్టాలకు విరుద్ధం : ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి


ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఇల్లెందు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొల్పుతామంటున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల వల్ల డ్రాపవుట్స్ పెరిగే ప్రమాదం ఉందని విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యావకాశాలు ఆవాసాలకు అందుబాటులో ఉండాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇల్లెందులో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం కిలోమీటర్ పరిధిలో ఆవాసాలకు దగ్గర ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో యూపీఎస్‌లు, ఐదు కిలోమీటర్ల పరిధిలో హైస్కూళ్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియోజకవర్గ కేంద్రాల్లోనే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తుందని, విద్యార్థులకు అందుబాటులో లేక వారు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. నిధులు వృథా చేయకుండా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి కేటాయించే నిధులతో గురుకులాలకు భవనాలు, మౌలిక వసతులు కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి గురుకులాలు ప్రారంభించినా.. ఒక్క గురుకులానికి కూడా భవనం నిర్మించలేదని విమర్శించారు. భద్రాద్రి జిల్లాలో పీఆర్టీయూకు ద్రోహం చేసినందుకే మాజీ జిల్లా అధ్యక్షుడితోపాటు నలుగురిని సస్పెండ్ చేశామని, వారికి తమ యూనియన్‌తో ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. బిల్డింగ్ ఫండు, హౌసింగ్ ఫండ్ పేరిట రూ.కోటికి పైగా వసూలుచేసి తమ స్వంత ఖాతాల్లో వేసుకొన్నారని, ఆ సొమ్మును కక్కిస్తామని అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.నర్సయ్య, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రావు, ఇల్లెందు మండల అధ్యక్షడు ధారావత్ రమేష్, మండల నాయకులు బి.శ్రీనివాసరావు, భాస్కర్, జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఎరువుల కోసం రైతుల నిరీక్షణ..

- తగ్గిన సరఫరా.. పెరిగిన డిమాండ్
- ఆందోళనలో అన్నదాతలు

ఇల్లెందు టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంటల దిగుబడి కోసం వాడే ఎరువులు సరిపడా లభ్యం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. యూరియా సరఫరా తక్కువగా ఉండటంతో ఒక్కో రైతుకు కేవలం రెండు, మూడు యూరియా కట్టలే ఇస్తున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇల్లెందు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నారు. అయితే


ఎరువుల కోసం మార్కెట్ యార్డులో మహిళా రైతుల నిరీక్షణ

ప్రస్తుతం వ్యవసాయ సాగు ముమ్మరం కావడంతో ఎరువులు తీసుకుపోయేందుకు రైతులు మార్కెట్‌యార్డుకు తరలివస్తున్నారు. రైతుల డిమాండ్ మేరకు అధికారులు ఎరువులను సరఫరాచేసే పరిస్థితి లేకపోవడం ఆలస్యమైతే ఎరువుల లభ్యత కష్టమవుతుందనే కారణంతో బుధవారం ఉదయం నుంచే రైతులు మార్కెట్‌యార్డుకు చేరుకున్నారు. ప్రధానంగా మహిళా రైతులు తరలిరావడంతో మార్కెట్‌యార్డు ఆవరణమంతా కోలాలంగా మారింది. ఎరువులను పెద్దఎత్తున సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళా రైతులు కోరారు. ఎరువుల సరఫరాపై ప్రాథమిక సహకార పరమితి సంఘం సెక్రటరీ హీరాలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఇండెంట్ ప్రకారమే ప్రతి రైతుకు యూరియా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

సర్వేలతోనే సరి.. పరిష్కారమేది మరి?

(5వ పేజీ తరువాయి)

రెట్టింపు విస్తీర్ణంలో రైతుల పేర్లతో విస్తీర్ణం నమోదు చేశారు. అప్పటి రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని భూ యజమానులు ఆరోపిస్తూ వచ్చారు. ధరణి పోర్టల్ ప్రవేశపెట్టే సమయంలో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో ఖాస్రాపహణీలో నమోదై ఉన్న 3,090 ఎకరాల విస్తీర్ణం కంటే అదనంగా పేర్లు, విస్తీర్ణం నమోదయ్యే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అంత విస్తీర్ణంలోనే రైతుల పేర్లు నమోదయ్యాయి. ఈ క్రమంలో వాస్తవంగా తరతరాలుగా సాగులో ఉండి అన్ని హక్కులున్నా.. యజమానుల పేర్లు ధరణిలో నమోదు కాలేదు. పాస్ పుస్తకాలు కూడా జారీ కాలేదు. అనర్హులు పేర్లు ధరణిలో నమోదవడంతో పాటు వారికి పాస్‌పుస్తకాలు కూడా జారీ అయ్యాయి. యజమానులు న్యాయం చేయాలంటూ దరఖాస్తు చేసినా ఆర్ఎస్ఆర్ ఖాళీ లేదంటూ అర్హులైన రైతుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

సర్వేలతో సరి..

133 సర్వే నెంబర్‌లో ఇబ్బందులు ఉండటం, రైతుల మధ్య వివాదం కారణంగా 2016లో మొత్తం విస్తీర్ణం సర్వే చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. సర్వేయర్లు కొంత మేర సర్వే చేసినా అప్పట్లో వచ్చిన అభ్యంతరాల మేరకు సర్వే మధ్యలోనే నిలిపివేసారు. 2021లో సమస్య అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి వెళ్లటంతో పూర్తి స్థాయిలో ఎంజాయ్‌మెంట్ సర్వే జరిపించి వాస్తవంగా ఎవరైతే అర్హులో వారికి టైటిల్ ఇవ్వాలని, అర్హత లేని వారిని ధరణి పోర్టల్ నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ గంగారంలో రైతులతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి న్యాయం చేస్తామని ప్రకటించారు. సర్వే పూర్తయినా ఇది కూడా ముందుకు సాగలేదు. కొందరికి మాత్రమే పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. గతేడాది నవంబరులో తిరిగి ఈ సర్వే నెంబర్లో మొత్తం విస్తీర్ణం సర్వే చేసి నివేదికను జిల్లా అధికారులకు అందజేశారు. కానీ ఎనిమిది నెలలు గడిచినా మళ్లీ సమస్య మొదటికొచ్చింది.

అక్రమ రిజిస్ట్రేషన్ల సమస్య

బేతుపల్లి రెవెన్యూలో గంగారం, పాకలగూడెం, నారాయణపురం, రామానగరం, కిష్టాపురం, తుంబూరు గ్రామాలకు చెందిన రైతులతో పాటు ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన రైతులకు 133 సర్వే నెంబర్‌లో భూములున్నాయి. వాస్తవంగా భూములున్న వారు కొందరికి టైటిల్ ఉన్నా 300 మంది రైతుల వరకూ భూమి సాగులో ఉన్నా వారికి టైటిల్ లేదు. కానీ సమీపంలో ఉన్న అస్సైన్‌మెంట్ భూములు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన రైతులు పక్కనే పట్టా భూమి అయిన 133 నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇలాంటి వారికి అస్సైన్‌మెంట్‌లో పొజిషన్‌లో ఉండగా టైటిల్ మాత్రం 133 సర్వే నెంబర్‌లో పొందారు. దీని వల్ల వాస్తవంగా 133లో సాగులో ఉన్న రైతులు నష్టపోతున్నారు. దీంతో పాటు అప్పట్లో 878/938, 148 సర్వే నెంబర్లలో రెండు వేల ఎకరాలకు పైగా భూములను సర్వే చేసి నివేదిక అందజేశారు. ఏళ్ల గడుస్తున్నా సమస్యకు పరిష్కారం దొరకకపోవటంతో భూ యజమానులు ఆందోళన చెందుతున్నారు.

పైరవీల జోరు!

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులను చేరవేస్తే.. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యాభ్యాసం పూర్తిగా కుంటుపడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయుల పైరవీలు తారస్థాయికి చేరడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పాఠశాలలు విద్యార్థుల కోసమా.. ఉపాధ్యాయుల కోసమా !?

గ్రామాల్లోని విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పించి.. వారి విద్యాభ్యాసం కోసం నియమించబడిన ఉపాధ్యాయులు ప్రస్తుతం తమ సౌకర్యం కోసం పోటీ పడుతున్నారు. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో 450-500 మందిగా ఉన్న విద్యార్థుల సంఖ్య.. ప్రస్తుతం 100 - 150 సంఖ్యకు పడిపోయిందంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల భవిష్యత్ కంటే కొందరు ఉపాధ్యాయులు తమ సౌకర్యమే ముఖ్యమని భావిస్తుండడం గమనార్హం.

గురుకులం.. దూరం.. భారం!

(5వ పేజీ తరువాయి)

జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వసతి విషయానికి వస్తే.. బెడ్ల నుంచి ఆహారం వరకు నాణ్యతగా ఉండం.. సన్నబియ్యంతో భోజనమే కాక మటన్, చికెన్, గుడ్లు, పాలను అందిస్తున్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా విద్యనందించేలా ఏర్పాట్లు ఉండడంతో.. విద్యార్థినుల నుంచి కూడా ఆదరణ పెరుగుతోంది. అయితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో.. అందుకు తగ్గట్టుగా గురుకులాల్లో సౌకర్యాలు లేవని తెలుస్తోంది. గతంలో ఒక గదిని నలుగురు విద్యార్థులకు కేటాయించిన అధికారులు.. ప్రస్తుతం ఒకే గదిని ఆరు నుంచి ఎనిమిది మంది విద్యార్థులకు కేటాయిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. దీంతో విద్యార్థులకు వారి పుస్తకాలు, బ్యాగులు, ట్రంకు పెట్టె.. తదితర సామగ్రిని పెట్టుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉమ్మడి జిల్లాలోని బీసీ సంక్షేమ శాఖ గురుకులాల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో సీట్లకు సరిపడా విద్యార్థులు మాత్రమే ప్రవేశపరీక్ష రాయడంతో దాదాపు అందరికీ సీట్లు వచ్చేవి. కానీ రెండు, మూడేళ్లుగా పరీక్ష రాస్తున్న విద్యార్థుల సంఖ్య పెరగడంతో పోటీ పెరిగింది. ఒక్కో గురుకులంలో వందల సంఖ్యలో ఉన్న సీట్లకు వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడుతుండడం విశేషం. సంక్షేమ శాఖల గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా బీసీ గురుకులాల్లో గత ఏడాది 2వేల మేర సీట్లు ఖాళీగా మిగిలితే ఈసారి సీట్లన్నీ భర్తీ అవుతున్నాయంటే గురుకులాలపై విద్యార్థుల తల్లితండ్రులు మొగ్గు చూపుతున్నారని తెలుస్తుంది. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తుంది.

దూరాభారానికి పరిష్కారం చూపేనా !?

గురుకులాల్లో సీట్లు పొందిన విద్యార్థులు.. తమ సొంత జిల్లాలో కాకుండా వేరే జిల్లాలో సీట్లు వచ్చినప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు తమ స్వస్థలాలకు దూరంగా ఉన్న గురుకులాల్లో చేరినప్పుడు, ప్రయాణ ఖర్చులు పెరగడమే కాకుండా, తల్లిదండ్రులు తరచూ సందర్శించడం కూడా కష్టమవుతోంది. ఈ క్రమంలో స్టూడెంట్స్. తమ కుటుంబ సభ్యులు,స్నేహితులు ఇంటి వాతావరణం నుంచి దూరంగా ఉండటం వల్ల మానసికంగా ఇబ్బందులు పడొచ్చు. ఇది ఒంటరితనంతో పాటు అసౌకర్యానికి దారి తీస్తోంది. దీంతో చదువుపై శ్రద్ధ తగ్గి ఇతర ఆలోచనలకు దారి తీస్తుందనే వాదనలు వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి.. ఎదూరాభారానికి తక్షణ పరిష్కార మార్గం చూపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులూ కోరుతున్నారు.

జ్వరం.. జలుబు..!

- జిల్లాను వణికిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి
- కిటకిటలాడుతున్న వార్డులు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జ్వరం.. జలుబు.. దగ్గు.. ఇలా సీజనల్ వ్యాధులు జిల్లా జనాన్ని వణికిస్తున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తోడు వాతావరణంలో వచ్చిన మార్పులతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. మాతా శిశు కేంద్రం మొదలుకొని పిల్లలు, గర్భవతులు, బాలింతలు.. పలు అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి బారులు తీరుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఆస్పత్రి వద్దకు జనం పిల్లలు ఎత్తుకుని వస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలో చాలా వరకు జ్వరం, దగ్గు, గొంతునొప్పి జలుబు కేసులు నమోదవుతున్నాయి. వీటితో పాటు తాగునీటి కలుషితంతో అధికంగా కామెర్లు (జాండిస్) కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది.

రోజుకు 1500కు పైగానే!

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సాధారణ సమయంలో వెయ్యి నుంచి 1200 వరకు ఓపీ ఉంటుంది. కానీ గత 10 రోజులుగా దీని సంఖ్య 1500కు పైనే ఉంటోంది. దీంతో పాటు వార్డుల్లో జ్వర పీడితులతో పాటు సాధారణ సమస్యలు, కిడ్నీ సమస్యలతో బాధపడే వారు, గుండె, నరాలకు సంబంధించిన సమస్యలు ఉన్నవారితో కిటకిటలాడుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగులకు బెడ్‌లు కూడా సరిపోవడం లేదు. దీంతో ఒక్కో బెడ్‌కు ఇద్దరు చొప్పున రోగులు పడుకుని వైద్య చికిత్స పొందుతున్నారు. అయితే తాము సేవల పరంగా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. వచ్చిన ప్రతి రోగికీ పరీక్షలు నిర్వహించి నివేదికల ఆధారంగా చికిత్స అందిస్తామని చెబుతున్నారు. అవసరమైన వారిని ఇన్‌పేషంట్లుగా ఉంచి.. సకాలంలో వైద్య చికిత్స చేస్తున్నట్టు తెలిపారు.

జూలై 7నుంచి 16వరకు ఆస్పత్రిలో రోగుల నమోదు ఇలా..

తేదీ	ఓపీ	ఐపీ
జూలై 7	1605	116
8-07	1491	87
9-07	1248	90
10-07	1479	102
11-07	1411	113
12-07	1397	120
14-07	1651	123
15-07	1508	116
16-07	1564	78
10-07	2024	176
11-07	1529	139

తీవ్ర వర్షాభావంతో కరివేద సాగును దున్నేసిన రైతు

వైరా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావంతో వరిపైరు ఎదుగుదల లేని కారణంగా ఓ రైతు ఏకంగా ఆ పైరును దున్నేస్తున్నాడు. మండలంలోని తాటిపూడి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే రైతు బుధవారం ఎదుగుదల లేని వరిపైరును ట్రాక్టర్‌తో దున్నేశాడు. ఎన్నెస్పీ రాపల్లి మేజర్‌కు చెందిన ఒక మైనర్‌కు చివరి ఆయకట్టుగా శ్రీనివాసరావు భూమి ఉంది. వైరా రిజర్వాయర్ కుడికాల్వ పక్కనే ఈ భూమి ఉండటంతో 20 రోజుల కిందట కురిసిన వర్షాల సమయంలో పొడి వరి విత్తనాలను తన భూమిలో వెదజల్లాడు. జూలైలో వర్షాలు కురిసి పైరు ఎదుగుతుందని ఆ తర్వాత వైరా రిజర్వాయర్ కుడికాల్వ ద్వారా వచ్చే నీటిని మోటర్ ద్వారా మళ్లించి వరిపంటను కాపాడుకోవచ్చని భావించాడు. 20రోజుల కిందట పొడి విత్తనాలు చల్లుకోగా మొక్క ఆశించిన రీతిలో మొలిచింది. మొలకెత్తిన నాటి నుంచి ఇప్పటివరకు 20రోజులుగా వర్షాలు లేకుండాపోయాయి. దాంతో పైరు ఎదుగుదల నిలిచిపోయింది. ఎదుగుదల లేని వరిపైరుతో దిగుబడులు రావని భావించిన రైతు ట్రాక్టర్‌తో దున్నేశాడు.


ఎదుగుదల లేని వరిపైరును దున్నేస్తున్న ట్రాక్టర్

తేలిన ఎంపీటీసీల లెక్క

(5వ పేజీ తరువాయి)

13 స్థానాలుగా లెక్కతేల్చారు. మొత్తంగా ఖమ్మం జిల్లాలో 283తో తుదిగా ఎంపీటీసీలుగా ప్రకటించారు.

● భద్రాద్రి జిల్లాలో 471గ్రామ పంచాయతీలు, 22జిల్లా పరిషత్(జడ్పీటీసీ) స్థానాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆరంభంలోనే ముసాయిదా జాబితా ప్రకటించి 236 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేయగా తాజాగా సుజాతనగర్‌లోని మూడు ఎంపీటీసీలు కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. వీటిని మినహాయిస్తే 233 ఎంపీటీసీస్థానాలు ఉన్నట్లు లెక్కతేల్చారు. బీసీ రిజర్వేషన్ల వ్యవహారం ఖరారైతే త్వర లో నోటిఫికేషన్ విడుదలయ్యే ఆస్కారం ఉందని అధికారులు చెబుతున్నారు.

నరమేధం సాగిస్తున్న బీజేపీ సర్కార్


అమర వీరుల స్మారక స్థూపాలను ఆవిష్కరించిన కేంద్ర కమిటీ నాయకులు ప్రదీప్ ఠాకూర్

ఇల్లెందు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ.. నిర్బంధాలతో నరమేధం సాగిస్తోందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్ ఆరోపించారు. హక్కుల సంఘాల నాయకులను, జర్నలిస్టులను, ప్రశ్నించే వారిని ఉపా చట్టం పేరుతో ఏళ్ల తరబడి జైళ్లలో నిర్బంధిస్తూ అర్బన్ నక్సలిజం పేరిట అమానుష నిర్బంధకాండ అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో బుధవారం మాస్ లైన్ ఆధ్వర్యంలో కేంద్రకమిటీ నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభ, అలాగే మాస్‌లైన్ అమరులు చంద్ర కృష్ణమూర్తి, గండి యాదగిరి, చంద్రశేఖర్‌ల స్మారక స్థూపాల ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రదీప్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. బీజేపీ ఆర్ఎస్ఎస్ శక్తులు రాజ్యాంగాన్ని గౌరవించడం లేదని, మతాలు ప్రాంతాలు భాషల పేరిట ప్రజలను చీలుస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో రైతులు మహోత్తర పోరాటం బీజేపీ కార్పొరేట్ రంగును బట్టబయలు చేసిందన్నారు. లౌకిక శక్తులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగా రావు మాట్లాడుతూ కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట వందల మంది ఆదివాసీలను హతమారుస్తూ నెత్తుటేరులు పారిస్తోందని ఆరోపించారు. ఆదివాసీలపై నరమేధం సాగిస్తున్నారని తుదకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని కూడా అర్బన్ నక్సలైట్‌గా ప్రకటించారని తెలిపారు. హిందూ మత రాజ్య స్థాపన లక్ష్యంగా సాగుతున్న బీజేపీ శక్తులపై ఐక్య పోరాటాలకు పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం 420 హామీలు, ఆరు గ్యారెంటీ పథకాలను అరకొరగానే అమలు చేసిందని మాటలు కోటలు దాటుతున్నా చేతలు గడపదాటడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కెచ్చల రంగారెడ్డి, చంద్రన్న, చంద్ర అరుణ, రాయల విమల, పద్మ, యాకూబ్ షావలి, తదితరులు ప్రసంగించారు.

కదం తొక్కిన ఎర్ర దండు

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ అమరుల స్థూపాల ఆవిష్కరణ సందర్భంగా పట్టణంలో వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించింది. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన పార్టీ శ్రేణులు ఎర్ర జెండాలతో జేకే కాలనీ నుంచి పటేల్ చౌక్ వరకు కదం తొక్కారు. అరుణోదయ కళారూపాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనకు డివిజన్ నాయకులు యాకూబ్ షావలి, పాయం వెంకన్న, బోస్, వెంకటేశ్వర్లు, పృథ్వీ, బిచ్చా, రాజు తదితరులు నాయకత్వం వహించారు.



పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట జరుగుతున్న దృశ్యం

ఉద్రిక్తతకు దారి తీసిన విద్యార్థుల నిరసన

- ఉపకార వేతనాల కోసం ఏఐఎస్‌ఎఫ్ పిలుపు
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నం
- విద్యార్థులు, పోలీసులకు మధ్య తోపులాట

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన హలో విద్యార్థి ఛలో కలెక్టరేట్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. పదుల సంఖ్యలో విద్యార్థులు సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ర్యాలీ చేపట్టారు. బాలికలు ఖాళీ ప్లేట్‌లతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం గేటు ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణతో పాటుగా మరికొంతమంది నాయకులు కలెక్టరేట్ గేటు ఎక్కేందుకు ప్రయత్నించారు. దీంతో విద్యార్థులు, పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకొంది. తర్వాత ఇరుపక్షాల శాంతించాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిపాలన నుంచి విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వలేదని, విద్యార్థులకు కొన్ని కాలేజీ యాజమన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదని విమర్శించారు. పదేళ్లుగా రూ.8,158 కోట్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించాలని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిలు నాగుల్‌మీరా, మధు, శివనాయక్, వంశీ, నాయకులు మనోజ్, సురేష్, పవన్, వెంకటేష్, లక్ష్మణ్, నాగేంద్రబాబు, గోపి, పావని, మల్లికా, జ్యోతి పాల్గొన్నారు.

నేడు ఇల్లెందులో మూడు జిల్లాల స్థాయి మహిళాశక్తి సంఘాలతో సమావేశం

- మంత్రులు సీతక్క, పొంగులేటి రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహిళాశక్తిసంఘాలతో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి సమావేశం గురువారం ఇల్లెందులో ఏర్పాటు చేశారు. సింగరేణి హైస్కూల్ క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు హాజరుకానున్నారు. సభను విజయవంతం చేసేందుకు బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఇల్లెందు నియోకవర్గస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ సంక్షేమ పథకాలను మంత్రుల చేతుల మీదుగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇల్లెందు నియోజకవర్గం నుంచి మహిళాశక్తి సంఘాల సభ్యులు భారీఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

అన్ని పథకాలు మహిళలకే..

- కోటిమందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 'పేట' నియోజకవర్గ ఇందిరా మహిళా శక్తి సంబురాలకు హాజరు

దమ్మపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కోటి మంది మహిళలను కోటీశ్వరులనే చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వంలో వారికి అధిక ప్రాధాన్యమిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సంక్షేమపథకాలను మహిళలకే అందిస్తున్నారని రెవెన్యూ, గృహనిర్మాణలశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మె ల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం సాయంత్రం దమ్మపేట గిరిజన గురుకుల కళాశాలలో అశ్వారావుపేట నియోజకవర్గస్థాయి ఇందిరామహిళా శక్తి సంబురాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొంగులేటి డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలుగా రూ.3.02కోట్లు చెక్కును అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చుతున్నామన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో తొలివిడతలో 4,500 ఇళ్లు ఇచ్చామన్నారు. వచ్చే మూడేళ్లలో మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా, ప్రమాద బీమాను ప్రభుత్వం అందిస్తోందని, గతంలో రుణం తీసుకున్న సభ్యులు మృతి చెందింతే సభ్యులే చెల్లించాల్సి బాధ్యత ఉండేదని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ రుణాలకు కూడా బీమా చేస్తున్నామని, ప్రమాదబీమాగా రూ.10లక్షలు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వేలకోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని, మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ కూడా ఎగ్గొట్టిందని, నేటి తమ ప్రభు త్వం చిత్తశుద్ధితో వాటిని కూడా మహిళలకు ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, అందుకు మం త్రి పొంగులేటి ఎంతో సహకరిస్తున్నారన్నారు. అనంతరం కొత్తరేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, ఐటీడీఏ పీవో రాహుల్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిమ్మంపేట ఎత్తిపోతలతో గిరిజనులకు ప్రయోజనం

ములకలపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తిమ్మంపేట ఎత్తిపోతల పథకం గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ములకలపల్లి మండలం తిమ్మంపేటలో రూ.9కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాల కోసం రాష్ట్రప్రభుత్వం రాజీలేకుండా పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీడీవో పీవో రాహుల్, ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్, డీఈ మోతిలాల్, ఏఈ గఫూర్ పాషా, తహసీల్దార్ గన్యానాయక్, మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకరరావు, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, కారం సుధీర్ తదితరులున్నారు.

గోటి తలంబ్రాల విత్తనాలకు పూజలు



విత్తనాలను దేవస్థానం వైదిక సిబ్బందికి అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీ కృష్ణ చైతన్య భక్తజనసంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా శ్రీరామనవమి సమయంలో స్వామివారికి సమర్పించే గోటి తలంబ్రాలకు సంబంధించిన ధాన్యం విత్తనాలకు బుధవారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణ చైతన్య భక్తజన సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలోని భక్తబృందం రామాలయానికి చేరుకొని తమ వెంట తెచ్చిన విత్తనాలను దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వైదిక సిబ్బందికి అందజేశారు. భద్రాద్రి ఆలయంలో మూలవరుల వద్ద పూజలు నిర్వహించి అనంతరం ఆ విత్తనాలను వైదిక సిబ్బంది వారికి అందజేశారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి
- ఖమ్మం కలెక్టరేట్‌లో 11పైలెట్ ప్రాజెక్టు పాఠశాలల అభివృద్ధిపై సమీక్ష



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ఆకునూరి మురళి

ఖమ్మంకలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజలతో కలిసి పైలెట్ ప్రాజెక్టు కింద గుర్తించిన మధిర నియోజకవర్గంలోని 11ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ తెలంగాణ విద్యాకమిషన్ తరుపున ప్రభుత్వానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతీ మండలంలో తెలంగాణ పబ్లిక్‌స్కూల్స్ ప్రవేశపెట్టాలని సిఫారసు చేశామన్నారు. మధిర నియోజకవర్గం పరిధిలోని సర్కారు బడులను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలన్నారు. ఇందులో భాగంగా 11 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించామని.. వాటిలో రెండిటిని కేటగిరీ 1 కింద, 9పాఠశాలలను కేటగిరి 2గా విభజించాలన్నారు. కేటగిరి1లోని రెండు పాఠశాలలను ఎంపికచేసి వాటిలో 1000 నుంచి 1,200మంది విద్యార్థులకు సరిపడా గదులు, లైబ్రేరీ, ల్యాబ్‌లు, స్పోర్ట్స్, కిచెన్, డైనింగ్ హాల్, కాంపౌండ్‌వాల్ సౌర్యాలు అందించాలన్నారు. కేటగిరి 2లోని పాఠశాలల్లో రూ.కోటి నుంచి రూ.2కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కేటగిరి1లో సిరిపురం, జమలాపురం పాఠశాలలను ఎంపికిచేస్తున్నట్టు, వీటిని పూర్తిస్థాయిలో తెలంగాణ పబ్లిక్‌స్కూల్స్‌గా అభివృద్ధి చేయాలని తెలిపారు. కేటగిరి1లోని 2 పాఠశాలల్లో 25 నుంచి 30 తరగతి గదులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ స్థాయిలో తరగతి గదులను, డిజైన్ చేయాలని, గ్రీన్‌బోర్డు, డ్యూయల్ డెస్క్, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటుచేయాలన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఈ కమిటీలో విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే 30మంది సభ్యులు ఉండాలని, వీరిలో 50శాతం తప్పనిసరిగా మహిళలు ఉండేలా చూడాలన్నారు. పాఠశాల అభివద్ధి పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆమోదించాలని, చెక్కుల ద్వారా చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గంలో ఉన్న 5 మండలాల్లో ఎంపికచేసిన11 ప్రభుత్వ పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద సంపూర్ణంగా అభివృద్ధి చేయాలని అన్నారు. పాఠశాలలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌శ్రీజ మాట్లాడుతూ 11పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించి నివేదిక తయారుచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో ఎస్.సత్యనారాయణ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, విద్యాశాఖ ఈఈ విన్సెంట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులు, భక్తులకు సౌకర్యంగా ఉండేలా మరుగుదొడ్ల నిర్మాణం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పీవో

భద్రాచలం, జూలై 16(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనానికి వచ్చే పర్యాటకులు, భక్తులు అధికంగా తిరిగే కూడళ్లలో సౌకర్యంగా ఉండేలా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని రెవెన్యూ గెస్ట్ హౌజ్ ఎదురుగా, డిగ్రీ కళాశాల ఎదురుగా ఐటీసీ సీఎస్‌ఆర్ నిధులతో రూ.65లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లను ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో ప్రతి సంవత్సరం జరిగే ముక్కోటి ఏకాదశి, కల్యాణం మహోత్సవాలకు ఖండంతరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం, పట్టాభిషేక మహోత్సవానికి భక్తులు వస్తూ ఉంటారని వచ్చిన భక్తులు తప్పని సరిగా గోదావరిలో స్నానమాచరించిన తరువాతనే స్వామివారి దర్శనం చేసుకుంటారని అన్నారు. భక్తులకు, మహిళలకు సౌకర్యవంతంగా ఉండేలా గోదావరికి వెళ్లే దారిలో, డిగ్రీ కళాశాల ఎదురుగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ప్రారంభించడం జరిగిందని అన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టే సిబ్బం ది మరుగుదొడ్ల ప్రతిరోజు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. భక్తులకు మాత్రం ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, ఐటీసీ ఉన్నాతాధికారులు శ్యామ్‌కిరణ్, చెంగళరావు, గుర్తింపు సంఘం నాయకులు కనకమేడల హరిప్రసాద్ పాల్గొన్నారు.

సర్పాలను కాపాడుకుందాం

- పాములు రైతు నేస్తాలు
- స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్



ఉద్యోగులకు వివరిస్తున్న స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత సూచన మేరకు స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్, ప్రాణాధార ట్రస్ట్ సభ్యులు మహేష్, ముజఫర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉద్యోగులకు అవగాహన బుధవారం కల్పించారు. రాజీవ్ పార్క్ వాకర్స్‌తో, రామవరంలోని ఏకలవ్య స్కూల్లో, పాత కొత్తగూడెం తెలంగాణ ఇంగ్లీష మీడియం పాఠశాలలో విష సర్పాలను ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ మాట్లాడుతూ రైతు నేస్తాలైన సర్పాలను కాపాడుకుం దాం. వాటి బారీన పడకుండా జాగ్రత్త పడ దాం అని పిలుపునిచ్చారు. సర్పాలు జీవ వైద్యంలో భాగమని, ఔషదాల తయారీకి పాము విషమును ఉపయోగిస్తారని గుర్తించి వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972లో పామును చేర్చారని వివరించారు. కీటకాలు మిడతలు, కప్పలు, ఎలుకలు పందికొక్కులు వంటి వాటి నియంత్రణకు తోడ్పడతాయని, అన్ని పాములు విషపూరితం కావని ఉద్దేశపూర్వకంగా పాము లు కాటు వేయవని వివరించారు. పాము కా టు వేస్తే చేయవలసినవి , చేయకూడనివి వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అహ్మద్, అశోక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వీరభద్రాచారి, ఏకలవ్య స్కూల్‌ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాకర్స్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో జయలక్ష్మి
- అశ్వారావుపేటలో ఆస్పత్రి సీజ్



అశ్వారావుపేటలో నర్సింగ్‌హోమ్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

అశ్వారావుపేట రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయి అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జయలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీని, అశ్వారావుపేటలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల ను బుధవారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. వినాయకపురం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి జ్వరాల తీవ్రత, ఇతర సేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలోని వివిధ రకాల రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహించవద్దని, సకాలంలో విధులకు వస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం అశ్వారావుపేటలోని పలు ఆసుపత్రులను సందర్శించారు. ఆసుపత్రుల్లోని వివిధ రకాల రికార్డులను తనిఖీ చేశారు. లక్ష్మీనర్సింగ్‌హోమ్ అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. మరో ముగ్గురు అధికారుల బృందం ఆసుపత్రులను సందర్శించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆసుపత్రులు, క్లీనిక్‌లు, ల్యాబ్‌లు ఏవీ కూడా అనుమతులు లేకుండా నడపకూడదని తెలిపారు.

అర్హత కలిగిన వైద్యులు మాత్రమే వైద్యం చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ఆసుపత్రులు నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు మధువరుణ్, ఫైజుయుద్దీన్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భగీరథ పనితీరును పరిశీలించిన ఈఎన్‌సీ



పరిశీలిస్తున్న ఈఎన్‌సీ

దుమ్ముగూడెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పర్ణశాల మిషన్‌భగీరథ ప్లాంటు పనితీరును ఈఎన్‌సీ కృపాకరరెడ్డి బుధవారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్లాంట్‌లను పరిశీలించే లక్ష్యంలో భాగంగా మొట్టమొదట పర్ణశాల ప్లాంటును సందర్శించారు. గోదావరి ఇంటేక్‌వెల్ నుంచి శుద్ధి జరిగే వరకూ ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాణాలకనుగుణంగా శుద్ధ నీటిజలాల సరఫరా జరుగుతుందా లేదా అని తనిఖీ చేశారు. మెరుగైన పనితీరు కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. తదనంతరం జిల్లా వ్యాప్తంగా పలు ప్లాంట్లను పరిశీలించారు. ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా ఇంట్రా ఈఈ తిరుమలేష్, గ్రిడ్ ఈఈ నళిని, డీఈలు బ్రహ్మదేవ్, ఏసుబాబు, దుమ్ముగూడెం, చర్లలతో పాటు పలు మండలాల ఏఈలు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటర్ చోరీ

ముదిగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలోని జాతీయ రహదారి పక్కన ఓ రైతు బావి ఉన్న విద్యుత్ మోటర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. పొలంలోని వ్యవసా య బావి వద్ద ఉంచిన విద్యుత్ మోటర్ పైపులైన్లను ధ్వంసం చేసి మోటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని రైతు మల్లెల శ్రీనివాస్ తెలిపాడు. మోటర్ విలువ రూ.25 వేలు ఉంటుందని బాధిత రైతు శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బూర్గంపాడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం....బూర్గంపాడుకు చెందిన మంత్రపు సూర్యారావు (43) అనే వ్యక్తి తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న పనికి వెళ్లిన ఆయన ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో తాళ్లగొమ్మూరు సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి తీవ్ర గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని భద్రాచలంలోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో... వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

మృతుడికి భార్య విజయలక్ష్మీ, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

ఇల్లెందు టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు పట్టణంలోని జగదాంబసెంటరులో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. జగదాంబసెంటరు ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ రోడ్డు దాటుతుండగా ఖమ్మం నుంచి ఇల్లెందు వస్తున్న బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇల్లెందు పోలీసులు క్షతగాత్రు డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

30కిలోల గంజాయి పట్టివేత

లక్ష్మీదేవిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు గ్రామపంచాయతీ జాతీయ రహదారి మీదుగా గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో లోతువాగు అటవీ ప్రాంతం వద్ద మహబూబాబాద్ రంగసాయిపేటకు చెందిన బండి వెంకటేశ్వర్లు టీఎస్ 04యూఈ4225 ఆటోలో సీలేరు నుంచి గంజాయి తీసుకుని వస్తు పట్టుబడ్డాడు. ఆటోలో ఉన్న 30కేజీల గంజాయిని సీజ్ చేసి ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో మహిళ మృతి

- ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని నెహ్రూనగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మహిళ మృతి చెందింది. మహిళ మృతికి ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యం బాధ్యత వహించాలని కోరుతూ బుధవారం మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన వడిత్య పీక్లీ (59) ఏళ్ల మహిళలకు ఆ ఆస్పత్రిలో వారం రోజుల క్రితం గర్భసంచి ఆపరేషన్ చేశారు. ఆమె కోలుకుంటున్న తరుణంలో బుధవారం మృతి చెందింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబీకులు, బందువులు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వచ్చి ఆందోళనను విరమించాలని సూచించారు. ఆస్పత్రి యాజమాన్యం కూడా ఆమెకు అనారోగ్య కారణాలతో చనిపోయిందని తమ బాధ్యతారాహిత్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది.

యువకుడి ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం!

- ఈనెల 3న గడ్డిమందు తాగిన యువకుడు
- 13రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ప్రేమించిన బాలిక కుటుంబీకులు బెదిరించారని తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఖమ్మం రూరల్ మండలంలో ఘటన
- తమ కూతురిని వేధించాడంటూ అమ్మాయి కుటుంబీకుల ఫిర్యాదు



విఘ్నేష్‌చారి (ఫైల్)

ఖమ్మం రూరల్ / ఖమ్మం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మైనర్‌తో ప్రేమవ్యవహారం ఆ యువకుడి ప్రాణాలు తీసింది. ప్రేమించిన అమ్మాయి కుటుంబసభ్యులు బెదిరించడంతో.. భయపడిన ఆ యువకుడు గడ్డిమందు తాగి.. 13రోజుల పాటు చికిత్స పొందరూ మృతిచెందిన సంఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పడమటితండాలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి బుధవారం యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పడమటితండాకు చెందిన తమ్మోజు ఉపేంద్రచారి, సరస్వతిల కుమారుడు తమ్మోజు విఘ్నేషచారి(20) ఖమ్మంలో వెల్డింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నగరానికి చెందిన 17ఏళ్లఅమ్మాయితో ఏర్పడిన పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. దీంతో గత కొంతకాలంగా ఇద్దరూ ఫోన్లో తరచూ మాట్లాడుకుంటున్నారు. ఈ విషయం గమనించిన అమ్మాయి తండ్రి సదరు యువకుడిని కలిసి మా అమ్మాయితో సంబంధాలు కొనసాగించటం, మాట్లాడటం మానేయాలని లేదంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయపడిన విఘ్నేష్ ఈ నెల 3న గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నం చేయగా.. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసునమోదు చేశామని సీఐ ముష్కరాజు తెలిపారు. అయితే విఘ్నేష్‌చారి పెళ్లిచేసుకోవాలంటూ తమ కూతురిని వేధిస్తున్నాడని ఆమె తల్లిదండ్రులు ఈ నెల 3న ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అతిడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆ యువకుడు తన మేనమామ ఇంటికి రాకపోకలు సాగించే క్రమంలో తమ కూతురి వెంట పడేవాడని, తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధించేవాడని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే పోక్సో కేసు నమోదవడంతో భయపడిన విఘ్నేష్‌చారి అదే రోజుగడ్డిమందు తాగాడన్న చర్చ జరుగుతోంది.



సీపీఐ జిల్లా మహాసభలకు ముస్తాబైన మధిర

మధిర రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19,20తేదీల్లో మధిరలోని రెడ్డి గార్డెన్‌లో జరుగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఖమ్మంజిల్లా 23వ మహాసభలకు మధిర పట్టణం ముస్తాబైంది. పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా సభను జయప్రదం చేయాలని బుధవారం పార్టీ శ్రేణులు మధిర మండలం ఆత్కూరు రింగ్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో నగరాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు మాట్లాడుతూ జిల్లా మహాసభలకు సంబంధించి గత వారంరోజులుగా పార్టీ కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు.

విద్యతోనే ఉపాధి: మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులు విద్య నేర్చుకుంటే వారు కోరిన వృత్తి, వ్యాపారాల్లో ఉపాధి కల్పనలకు అవకాశం కల్పిస్తామని, ఈ మేరకు ఖమ్మం నగరంలోని నిరక్షరాస్యులకు మంచి అవగాహన కల్పించాలని మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. బుధవారం వయోజన విద్య డీడీ అనిల్, మెప్మా, ఆర్పీలు, వాలంటీర్లతో కేఎంసీలో మేయర్ సమావేశం నిర్వహించారు. ఖమ్మం నగరంలో 17వేల మంది వరకు నిరక్షరాస్యులుగా ఉన్నారని, వారందరికీ అక్షరాస్యత నేర్పించడంపై సమీక్షించారు. విద్యను నేర్చుకునే మహిళలకు కుట్టు మిషన్, చేతి వృత్తులు వంటి వాటిపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. దీంతో చదువుతో పాటుగా వారికి ఉపాధి అవకాశం పెరుగుతుందన్నారు. సంపూర్ణ అక్షరాస్యతగా ఖమ్మం నగరం మారాలని కోరారు. మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవోలు చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యాన్ని సాధించాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరుశాతం సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి ఆదేశించారు. జిల్లాలో కొన్ని పీహెచ్‌సీలు ఆదర్శంగా పనిచేస్తున్నాయని వాటిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన పీహెచ్‌సీల లోనూ వందశాతం పెరఫార్మెన్స్ సాధించాలని ఆమె కోరారు. ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఖమ్మం డివిజన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించిన లక్ష్యాలలో జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నూరుశాతం సాధించాయని, కొన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఎంసీహెచ్‌లు ఇమ్యూనైజేషన్, ఏఎన్‌సీ ప్రభుత్వ ప్రసవాలలో వెనకబడి ఉన్నాయని అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీనిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ఈ వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఫలితంగా రాష్ట్ర స్థాయిలో జిల్లా ఆశించిన స్థాయిలో ఉండకపోవడంతో రాష్ట్ర అధికారుల ఒత్తిడి అధికం అవుతుందన్నారు. వీటిని మెడికల్ ఆఫీసర్లు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని, వారం రోజుల్లో నిర్వహించే సమావేశం నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి

ఆర్థిక సహాయం అందజేత

జిల్లాలో వైద్యశాఖలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన ఆశ కార్యకర్త మోడుగు సులోచన, ఆశ కార్యకర్త, బస్వాపురం గ్రామం, తల్లాడ ఎంపీహెచ్‌సీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ వరప్రసాద్, మరణానికి సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రచ్చ శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్, కోశాధికారి డాక్టర్ రత్న మనోహర్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో చేతుల మీదుగా వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో. డాక్టర్ చందు నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం , స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, ఎన్‌హెచ్ఎం (డీపీవో.) దుర్గ, నాగరాజు, రవితేజ, కృష్ణ మోహన్, పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎస్బీ సీఐగా రామకృష్ణ

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 16ఆంధ్రజ్యోతి): ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ సీఐగా జే. రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఖమ్మంలో పలు విభాగాలలో సీఐగా విధులు నిర్వహించారు. ఇటీవల ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్నారు. దీంతో ఆయనను ఖమ్మం ఎస్బీ విభాగానికి నియమించారు.

ఓపెన్ పది, ఇంటర్ కేంద్రం మంజూరు

తిరుమలాయపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ పది, ఇంటర్ కేంద్రం మంజూరైనట్లు హెచ్ఎం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనివార్యకారణాల వల్లచదువు మధ్యలో మానేసిన వారికి సార్వత్రిక విద్యాపీఠం కలిపిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెద్దతండా కస్తూర్బా పాఠశాల తనిఖీ



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోని కస్తూర్బా పాఠశాలను తహసీల్దార్ పిల్లి రాం ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతిగదులు, వంటగదులు, డ్రింకింగ్ వాటర్, తదితర వాటిని పరిశీలించారు. ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కూలీ కోసం..భూమి కోసం పోరాటాలు చేయాలి

» వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి): పేదలు, వ్యవసాయ కూలీలు కూలీ కోసం, భూమి కోసం తమ పోరాటాలను ఉధృతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక రావెళ్ల భవన్‌లో బుధవారం కొప్పుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలను చిన్న చూపు చూస్తున్నాయన్నారు. ధనికులకు, భూస్వాములకు లక్షల రూపాయలను రైతు భరోసా కింద అందిస్తున్నాయన్నారు. వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇస్తానన్న హామీ ప్రకారం రూ.12వేలను ఇవ్వటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. వామపక్షాల సహకారంతో తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మహిళా కూలీలపట్ల వివక్ష కొనసాగుతూనే ఉందని, మహిళలను రెండవ జాతి పౌరులుగా చూస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగ రోజు కూలీని కనీసంగా రూ.600లకు పెంచాలని పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం కష్టమవుతున్న పరిస్థితుల్లో కూలీలు ప్రత్యామ్నాయ పనుల వైపు చూస్తున్నారన్నారు. కార్మికుల శ్రమను దోచుకునే యాజమాన్యాలు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దోపిడీ లేని సమసమాజ నిర్మాణానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుగ్గి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా పెద్దపాక మల్లేశ్వరరావు, 18మందిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంద్ర ప్రసాద్, రచ్చా నర్సింహారావు, పోతనబోయిన పెరుమాళ్లు, కట్టెకోల వెంకన్న, యడవల్లి సైదమ్మ, గురిజాల ఉపేందర్, సామాల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరిపోసిన చంద్రశేఖర్



రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ మాజీ కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు రాయల చంద్రశేఖర్ రైతాంగ ఉద్యమాలకు తన జీవిత కాలం పాటు ఊపిరి పోశారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. బుధవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రాయల చంద్రశేఖర్ మొదటి వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతాపం ప్రకటించిన నాయకులు నివాళులర్పించారు. రాయల చంద్రశేఖర్ జీవిత పోరాటాలను, ఉద్యమాలను గుర్తు చేశారు. నాయకులు కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, శోభ, కిరణ్, రామకృష్ణ, ఆజాద్, వెంకటేష్, సత్తార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటరమణ

తిరుమలాయపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వ్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని తనిఖీ చేశారు. కాకరవాయి, బచ్చోడు పల్లెదవాఖానాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని సిబ్బంది అప్రమత్తంగా ఉండలన్నారు. వర్షాకాలంలో వైరల్‌జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బీరోలులో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. ఈకార్యక్రమంలో సుబ్లేడు వైద్యాధికారి బి.వసుంధర, డాక్టర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ బీజే క్లైమెంట్

ఖమ్మం సంక్షేమవిభాగం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో దశాబ్దాలుగా వెట్టి చాకిరి చేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని సీపీఐ కార్పొరేటర్ బీజే క్లైమెంట్ మేయర్ పునుకొల్లు నీరజను కోరారు. ఈ మేరకు మేయర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం నగరంలో 16మంది కార్మికులు పదేళ్లకు పైగా నీటి పంపుల విభాగంలో మెకానిక్‌లుగా పనిచేస్తున్నారని తెలిపారు. అయితే గతంలో కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు ఇచ్చారని, తర్వాత కేఎంసీ నుంచి వేతనాలు అందుతున్నాయని వారిని సాంకేతికంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గుర్తించాలని మేయర్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ కేఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిశీలన చేస్తామన్నారు. ఏఐటీయూసీ నాయకులు తొట రామాంజనేయులు, మహేష్, రోహిత్, బీవీ చారి, వేణుగోపాల్, సతీష్, శివకృష్ణ, వెంకటేశ్వర్లు, హరీష్, పాల్గొన్నారు.

ఎన్ఏపీఈ సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పమ్మి



ఖమ్మం కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ (ఎన్ఏపీఈ) గ్రూప్ సీ సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖమ్మానికి చెందిన పమ్మి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు భద్రాచలంలో ఎన్ఏపీఈ 5వ రాష్ట్ర ద్వైవార్షిక మహాసభలను నిర్వహించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 డివిజన్ల నుంచి ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారు. ఈ ఎన్నిక రెండేళ్ల పాటు కొనసాగనుంది. వెంకటేశ్వరరావు ట్రంక్‌రోడ్డు సబ్‌పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పమ్మి వెంకటేశ్వరరావును డివిజన్ నాయకులు కోటేశ్వరరావు, హుస్సేన్, వీరన్న, ఎస్‌వీటీ కుమార్, రాంప్రసాద్‌లు అభినందించారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

» పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నకుమార్

నేలకొండపల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తొలపనూరి రత్నకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డుల మంజూరు, పీఆర్సీ పెండింగ్ డీఏలు విడుదల చేయగంతో పాటుగా దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ చూపాలని కోరారు. ఉపాధ్యాయ ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించి షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఖాళీలను డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేష్, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరావు, నాయకులు నందిగామ జయరాజు, పులి అప్పారావు, క్రాంతికుమార్, రెహానా, అనూష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నకుమార్

అర్హతగల కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలి

» కళాకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌పాండే



మాట్లాడుతున్న అడిషనల్ ఏసీపీ రామదాస్ తేజ

నేలకొండపల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి): అర్హత గల కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలని కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌పాండే డిమాండ్ చేశారు. సకల కళల పరిరక్షణ జేఏసీ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక పుట్టపర్తి సాయిబాబా మందిరంలో తెల్లగొర్ల లింగ స్వామి అధ్యక్షతన జరిగింది. కళాకారులకు ఆరోగ్య కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కళాకారులు వృత్తిరీత్యా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. కళాకారులు ఐక్యంగా పోరాడాలని, అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని మురళీధర్‌పాండే పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ట్రాఫిక్ అడిషనల్ ఏసీపీ రామదాస్ తేజ మాట్లాడుతూ కళలంటే తనకు ఎంతో అభిమానమని, కళాకారులను అభిమానిస్తానన్నారు. కళాకారులకు తన వంతు సహాయం అందించటానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో తునికి లక్ష్మణాచారి, తేజావత్ తేజ, సత్యనారాయణ, మొగిలి నాగేశ్వరరావు, అంజయ్య, మమత, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాలకు ఆశాదీపం కమ్యూనిస్టు పార్టీ

పెనుబల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వందసంవత్సరాల పోరాటాల చరిత్ర సీపీఐదని, బడుగు బలహీనవర్గాలకు ఆశాదీపంగా నిలిచిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం మండలం గట్టుగూడెంలో పెనుబల్లి మండల 9వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటుందని, పేదవాడి భూమి, భుక్తి కోసం అలుపెరగని పోరాటాలు చేసి పాలకపక్షాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా ఉద్యమాలు నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో భూపోరాటాల్లో విజయం సాధించామని పేర్కొన్నారు. నరేంద్రమోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ గిరిజన చట్టాలు, అటవీ, కార్మికుల చట్టాలను మార్చివేస్తూ పెట్టుబడిదారులకు పనిచేస్తుందని విమర్శించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి సురేష్ మాట్లాడుతూ వామపక్ష భావజాలం తక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో సీపీఐ పేదల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించి ఉద్యమ పార్టీగా కొనసాగుతుందన్నారు. ఈనెల 19,20తేదీల్లో మధిరలో జరిగే ఖమ్మంజిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సొసైటీ డైరెక్టర్ బద్దం జోగయ్య అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగు నర్సింహారావు, దండు ఆదినారాయణ, సీతామహాలక్ష్మీ, మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, భాస్కర్, తడికమళ్ల ఏబు, పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి క్షమాపణ చెప్పాలి

● కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొందయ్య

నేలకొండపల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి పాలేరు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, మంత్రి పొంగులేటికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధరణి స్థానంలో రైతులకు ఉపయోగ పడే భూభారతి చట్టాన్ని ముఖ్యమంత్రి సహకారంతో తెచ్చి రైతులను ఆదుకున్న పొంగులేటిపై అక్కసుతోనే జగదీష్‌రెడ్డి మతి తప్పి మాట్లాడుతున్నారని అన్నారు. పొంగులేటిపై జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు.

రూ.100కోట్లతో విద్యుత్ లైన్ల అభివృద్ధి

» ఖమ్మం సర్కిల్ పరిధిలో నిరంతర సరఫరాయే లక్ష్యం
» ఆగస్టు చివరినాటికిపనులన్నీ పూర్తి
» ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనగుర్తి శ్రీనివాసాచారి

కూసుమంచి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసే లక్ష్యంతో ఖమ్మం సర్కిల్ పరిధిలో సుమారు రూ.100కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని ఖమ్మం ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. బుధవారం కూసుమంచి మండలం పెరికశింగారం సబ్‌స్టేషన్‌కు కొత్తగా ఏర్పాటుచేసిన ఇంటర్ కనెక్టివిటీ లైనును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు పక్కాప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. ఖమ్మం సర్కిల్ పరిధిలో జిల్లాలోని సబ్‌స్టేషన్లను ఇంటర్ లింక్‌లైన్ ద్వారా కనెక్టవిటీ చేశామన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, మెయింటనెన్స్ సమయంలో ఒకలైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా.. మరొక సబ్‌స్టేషన్ నుంచి ప్రత్నామ్నాయలైన్ (ఇంటర్‌లింక్ లైన్) ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా చేశామన్నారు. భారీ వర్షాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడితే.. వేగంగా పునరుద్ధరించేందుకు బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెలాఖరు వరకు పనులన్నీ పూర్తయ్యేలా యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు.



పెరికశింగాలో కనెక్టవిటీ లైన్ ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

కూసుమంచి మండల కేంద్రంలో రూ.కోటి వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్‌షెడ్ మంజూరైనట్లు తెలిపారు. రెండు మూడురోజులుగా ఎండలు వేసవిని తలపిస్తుండటంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని, జిల్లాలో 7.9మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగమవుతుందన్నారు. 8.5 మిలియన్ యూనిట్ల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కూసుమంచి డీఈ నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యానాయక్ ఉన్నారు.



నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన

మధిర రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకం వల్ల మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య అన్నారు. బుధవారం మధిర మండలం సిరిపురం గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. ఆతర్వాత నానో యూరియా క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. నానోయూరియాను ఎంపిక చేసిన కలుపు మందులతో కలిపి పిచికారి చేయవచ్చునని రైతులకు ఆయన సూచించారు. అనంతరం మధిర రైతువేదికలో ఏఈవో, ఏవోలకు ఆయిల్‌ఫామ్ పంటపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చంద్ర, ఏవో సాయిదీక్షిత్, ఏఈవోలు వేణు, గురుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



రోగులకు న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న డాక్టర్

ఏన్కూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం యలమద్ది హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో న్యూట్రిషన్ కిట్లను డాక్టర్ రాములు బుధవారం టీబీ వ్యాధిగ్రస్తులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామని వ్యాధి లక్షణాలున్న వారు ముందుకు వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి పద్మ, పుష్పారాణి, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ వై.సురేష్, ఫార్మాసిస్టు నీరజ, ల్యాబ్ టెక్నిషియన్ రమణ, హెల్త్ అసిస్టెంట్ దుర్గప్రసాద్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి



వైద్యాధికారితో మాట్లాడుతున్న జిల్లా అధికారి రామారావు

ముదిగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి రామారావు సూచించారు. బుధవారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వ్యాక్సిన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అరుణాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు, ఫార్మసిస్టు సత్యావతి పాల్గొన్నారు.

సిరిపురం కాల్వకు నీరు విడుదల చేయాలి

తల్లాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌పీ సిరిపురం మేజర్ కాల్వకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు నల్లమోతు మోహన్‌రావు కోరారు. బుధవారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవన్‌లో అయినాల రామలింగేశ్వరరావు అధ్యక్షతన రైతుసంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు వానాకాలం సాగుకు సిద్ధమైన రైతులు వరి నారుపోశారన్నారు. కొన్ని రోజులుగా వానల్లేక నారుమళ్లు ఎండిపోతున్నాయని, సీతారామ ప్రాజెక్టు నీరు ఏన్కూరు వరకు వస్తున్నప్పటికి పక్కనే ఉన్న సిరిపురం కాల్వకు నీరు విడుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తక్షణమే నీరు ఇచ్చి పంటలకు ప్రాణం పోయాలన్నారు.

వరి నాట్లు వేసిన విద్యార్థులు



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

తల్లాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాల భారతి విద్యాలయం విద్యార్థులు బుధవారం తమ పాఠ్యాంశానికి అనుగుణంగా మండలంలోని కొత్త వెంకటగిరి గ్రామంలో వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించి దమ్ము చేసిన పొలంలోకి దిగి కూలీలతో కలిసి ఉత్సాహంగా వరినాటు వేశారు. వరి పంటను పండించే విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో డ్రోన్ ఉపయోగాలను, అది పనిచేసే విధానం తెలుసుకున్నారు. దీంతోపాటు వెంకట్రాముతండా వద్ద మిషన్ భగీరథ ప్రాజెక్టును సందర్శించి నీటి శుద్ధి, పంపిణీ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమీలరాణికి పొంగులేటి నివాళి



పెనుబల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీజీసీడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మేనత్త చిలుకూరి ప్రమీలరాణి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కీసర శ్రీనివాసరెడ్డి, మువ్వా అశోక్, మందపాటి వెంకటరెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏన్కూరు జూనియర్ కళాశాలకు మహర్దశ

ఏన్కూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మహర్దశ పట్టనుంది. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కళాశాలకు ప్రభుత్వం ఇటీవల రూ.18లక్షలు మంజూరుచేసింది. ఈ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నారు. ఫ్లోరింగ్, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, కెమిస్ట్రీ ల్యాబ్ మరమ్మతులు, పాత మరుగుదొడ్ల నిర్మాణం, గేమ్స్ మెటీరియల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బయాలజీల ల్యాబ్‌మెటీరియల్ తదితర పనులు చేపట్టనున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. త్వరలోనే మరమ్మత్తు పనులు జరుగుతాయన్నారు. దీంతో చాలావరకు కళాశాల సమస్యలు తీరుతాయని తెలిపారు. ఈఏడాది కొత్తగా 116మంది అడ్మిషన్లు పొందారని తెలిపారు.

రేపు ఇందిరా మహిళాశక్తి సంబరాలు



సంబరాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సన్యాసయ్య

వైరా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైరాలో నియోజకవర్గస్థాయి ఇందిరా మహిళాశక్తి సంబరాలను శుక్రవారం నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్య తెలిపారు. ఈ సంబరాల సన్నాహక సమావేశాన్ని బుధవారం వైరాలో నిర్వహించారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడు మండలాలస్థాయిలో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని విజయవంతం చేసేందుకు ఐదుమండలాల అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సంబరాలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో ఆర్.జయశ్రీ, ఎంపీడీవో సరస్వతీ, డీపీఎంలు అంజనేయులు, రాజేష్, పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సాగర్ ఆయకట్టుకు నీరు

- రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- 'ఆంధ్రజ్యోతి' తో కల్లూరు సర్కిల్ ఎస్ఈ వాసంతి



కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాగర్ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకు సాగర్ ఆయుకట్టుకు ప్రాధాన్యత క్రమంలో సాగునీరు అందించేలా కృషి చేస్తామని కల్లూరు జలవనరులశాఖ సర్కిల్ ఎస్ఈ జి.వాసంతి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఎస్ఈ వాసంతి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సాగర్ కాల్వ ద్వారా కల్లూరు ప్రాంతానికి గోదావరి జలాలతో పాటుగా సాగర్ నీరు కూడా వస్తున్నాయని, ఎగువ నుంచి వస్తున్న 1000 క్యూసెక్కుల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని కప్పలబంధం రెగ్యూలేటరీ వద్ద నుంచి మధిర బ్రాంచి కెనాల్‌కు 650 క్యూసెక్కులు, సాగర్ ఎడమకాల్వకు 375 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. వానాకాలంలో సాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన నారుమడులు ఎండిపోకుండా కాపాడేందుకు సాగునీటిని అందిస్తున్నామని, అందుకు గాను క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. తన పర్యవేక్షణలో సాగునీరు చివరి ఆయకట్టుకు వరకు అందేలా చూస్తున్నామని వివరించారు. వర్షాభావ సమయంలో సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఎస్ఈ వాసంతి కోరారు. సాగర్ ఆయకట్టు కింద క్షేత్ర స్థాయిలో నీటి అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా సాగునీరు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా మధిర బ్రాంచి కెనాల్ 0 కిమీ నుంచి 24 కిమీ వరకు, సాగర్ ఎడమ కాల్వ పరిధిలో 73 కిమీ నుంచి 101 కిమీ చివరి కాల్వల వరకు సాగునీరు చేరేలా దృష్టి సారించామన్నారు. సాగునీటిని వృథా కాకుండా రైతులు తమతో సహకరించాలని ఎస్ఈ వాసంతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు బ్యాగులు, దుస్తులు, నోట్‌బుక్స్ పంపిణీ

- రూ. 2 లక్షల సామగ్రి వితరణ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన నారాయణపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. మంత్రి పొంగులేటి సతీమణి మాధురి తన వంతుగా పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది విద్యా సంవత్సరం సరిపడ రూ. 2 లక్షల విలువ గల నోట్సులు, బ్యాగులు, ఏకరూప దుస్తులు, ప్యాడ్లు, వాటర్ బాటిల్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిణి పి నివేదిత, మాజీ సర్పంచు అంకిరెడ్డి కనకదుర్గా వాటిని విద్యార్థులకు అందజేశారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతుగా దాతృత్వం చాటుకున్న పొంగులేటి మాధురికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల చైర్మన్ కుమారి, హెచ్ఎం నాగమణి పాల్గొన్నారు.

గోదావరి జలాల రాకతో రైతుల్లో హర్షం

ఏన్కూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి):ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న గోదావరి జలాలు ఏన్కూరుకు రావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పూర్తిగా సాగర్ జలాలపైనే ఆధారపడిన రైతులు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలు రానుండడంతో రైతులు పరవశించిపోతున్నారు. రెండు పంటలకు నీరు సమృద్ధిగా అందుతుంది. ఈప్రాంత రైతున్నలు తండోపతండాలుగా వెళ్లి చూస్తు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఏన్కూరు రాజీవ్ లింక్‌కెనాల్ ను రూ.99కోట్లతో 8కి.మీ కాలవను కేవలం 16 నెలల్లో పూర్తిచేయించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పథకాలను ప్రతీ ఇంటికి చేర్చండి

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వం ఇచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి ఇంటికి చేర్చాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. బుధవారం మండలంలోని రేజర్లలో సింగరేణి ఆధ్వర్యంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ గోడౌన్, రూ.50లక్షలతో నిర్మించిన బతుకమ్మ ఘాట్ తూమును ఆమె ప్రారంభించారు. అదేవిధంగా పల్లె దవాఖానా నూతన భవనాన్ని ప్రారంభించిన తర్వాత హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూలు, సాక్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. విద్య, వైద్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అన్నివర్గాల విద్యార్థులకు గురుకులాలు ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి అస్వస్థతకు గురైన గ్రామానికి చెందిన రాధమ్మకు స్వయంగా ఎమ్మెల్యే డా.రాగమయి వైద్య సేవలందించి ఇంటికి పంపించారు. డీఎంహెచ్ఓ కళావతిబాయి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.టీ.సీతారామ్, గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, జేవీఆర్ ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాసు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వ్యవసాయ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రిజర్వాయర్ రోడ్డులోని కరెంట్ స్తంభాల షిఫ్టింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైరా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ స్తంభాలు తొలగించే ప్రక్రియను బుధవారం చేపట్టారు. రోడ్డు మధ్యలో కరెంట్ స్తంభాలతోనే సీసీ రోడ్డు నిర్మిస్తున్నారని, ఈ రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందనే విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ స్పందించారు. రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ స్తంభాలను తొలగించిన తర్వాతనే సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే మునిసిపల్, ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. రూ.80లక్షల సుడా నిధులతో జాతీయ ప్రధాన రహదారి నుంచి వైరా రిజర్వాయర్ వెళ్లే రోడ్డును కుడి కాల్వ హెడ్‌స్లూయిస్ వరకు రోడ్డుకు రెండువైపులా 15అడుగుల చొప్పున 30అడుగుల సీసీ రోడ్డు, రెండు అడుగుల వెడల్పు డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపట్టారు. డివైడర్‌కు ఒకవైపున రోడ్డు మధ్యలోనే కరెంట్ స్తంభాలు ఉన్నప్పటికీ వెట్‌మిక్స్ పోసి సీసీ వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా 'ఆంధ్రజ్యోతి' ఈ సమస్యను వెలుగులోకి తేవడం, ఎమ్మెల్యే స్పందించటం జరిగింది. ఆయన ఆదేశాలతో మునిసిపల్ కమిషనర్ చింతా వేణు కరెంట్ స్తంభాల తొలగింపు కోసం రూ.5.14లక్షల చెక్కును ట్రాన్స్‌కో అధికారులకు పదిరోజుల కిందట అందజేశారు. అయినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు ఈ స్తంభాల షిఫ్టింగ్‌లో జాప్యం చేస్తుండటంతో మంగళవారం రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే రోడ్డుపై ఉన్న స్తంభాలను చూసి సాయంత్రంలోగా వాటిని తొలగించాలని లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాంతో బుధవారం కరెంట్ స్తంభాల షిఫ్టింగ్ పనులు చేపట్టారు.

ఎండిపోతున్న పైర్లు.. సాగునీటి కోసం రైతుల అగచాట్లు

తల్లాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వర్షాభావంతో సాగునీరు అందక తల్లాడ మండలంలో పైర్లు ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న పైర్లను కాపాడుకునేందుకు అన్నదాతలు అగచాట్లుపడుతున్నారు. తల్లాడ మండలంలో ఖరీఫ్‌లో సుమారు 23వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని రంగంబంజర, మల్సూరుతండా, నూతన్‌కల్, అంజనాపురం, గూడూరు, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, అన్నారుగూడెం, గొల్లగూడెం, తల్లాడ గ్రామాలో రైతులు వరిసాగు చేపట్టారు. వరిసాగును వెదజల్లే నాటు పద్ధతిలో చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా వర్షాభావంతో పాటు ఎండల తీవ్రత వల్ల వెదజల్లే నాటువేసే పద్ధతిలో ఇప్పటికే సాగు చేసిన వరిపొలాలు బీటలు వారాయి. సుమారు 6వేల ఎకరాల్లో సాగు చేసిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. ఈదశలో పైర్లను కాపాడుకునేందుకు కొందరు రైతులు సమీపంలోని వాగులనుంచి ఆయిల్ ఇంజన్లతో సాగునీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, నీటిశాఖ ఉన్నతాధికారులు స్పందించి గోదావరి లేదా సాగర్ ద్వారా సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎండిపోతున్న వరినారు

అభివృద్ధి చేస్తున్నాం.. ఆశీర్వదించండి

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొణిజర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. బుధవారం మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరిగిన సన్నాకసమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గెలిచి ముఖ్యమంత్రికి కానుకగా ఇస్తామన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పే బీఆర్ఎస్ నాయకుల మాటలు వినొద్దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి నూతి సత్యానారాయణ, సూరంపల్లి రామారావు, నాయకలు వడ్డే నారాయణరావు, చెరుకుమల్లి రవి, గోసు మధు, కోసూరి శ్రీను, షేక్ మస్తాన్, చిరంజీవి, కమటాల రేణుక, బానోతు అనూష, మహేష్, రోశయ్య, ప్రసాద్, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, శేఖర్‌గౌడ్, ముత్తారావు, రాంబాబు, గంగారావు, సాయి, అశోక్, శంకర్, మురళి, అనీల్, సురేష్, వీరయ్య పాల్గొన్నారు.

నేషనల్ హైవే పక్కన డ్రెయినేజీ కోసం మార్కింగ్

- ఏళ్లతరబడి నెలకొన్న మురుగు నీటి సమస్యకు పరిష్కారం

వైరా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో ఏళ్ల తరబడి నెలకొన్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.24లక్షలతో 285మీటర్ల పొడవు డ్రెయినేజీ నిర్మించేందుకు బుధవారం మార్కింగ్ ఇచ్చారు. తల్లాడ వైపు వెళ్లే జాతీయ ప్రధాన రహదారిలో ఒక అపార్ట్‌మెంట్‌లోని నివాసాల నుంచి వెలువడిన వ్యర్థనీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక హైవే రోడ్డుపైనే ప్రవహిస్తుండడంతో రెండు సంవత్సరాలుగా వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్వయంగా రోడ్డుపైనున్న మురుగునీటిని పరిశీలించి వెంటనే డ్రెయినేజీని నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. దాంతో రూ.24లక్షలతో 285మీటర్ల డ్రెయినేజీ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్‌తో ఒప్పందాన్ని ఖరారు చేశారు.

బడుగు బలహీనవర్గాల ఆశాదీపం సీపీఐ : బాగం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

పెనుబల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల పోరాట చరిత్ర సీపీఐదని, బడుగు బలహీన వర్గాలకు ఆశాదీపంగా నిలిచిందని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని గట్టు గూడెంలో జరిగిన మండల 9వ మహాసభకు హాజరైన ఆయన మాట్లాడుతూ సీపీఐ పేదవాడి భూమి, భుక్తి కోసం అలుపెరగని పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ గిరిజన, అటవీ, కార్మికుల చట్టాలను మారుస్తున్నాని మండిపడ్డారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి సురేష్ మాట్లాడుతూ సీపీఐ పేదల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించి ఉద్యమ పార్టీగా కొనసాగుతుందన్నారు. ఈనెల 19,20తేదీల్లో మధిరలో జరిగే ఖమ్మంజిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సొసైటీ డైరెక్టర్ బద్దం జోగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగు నర్సింహారావు, దండు ఆదినారాయణ, సీతామహాలక్ష్మీ, మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, నాయకులు పొదిలి బాస్కర్, తడికమళ్ల ఏబు, చిల్లిముంత ముత్తారావు, నాగేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుంది : తహసీల్దార్

ముదిగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వహించినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ అన్నారు. ముదిగొండ రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహించిన వహీదాసుల్తానా, ఏఎస్‌వో సుమన్‌లు బదిలీలు వెళ్లడంతో బుధవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ లక్ష్మీ, ఆర్ఐలు కల్యాణి, ప్రసన్నకుమార్, సర్వేయర్ ఉమామహేశ్వర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవీందర్, జానీ, నాగలక్ష్మీ, రమాదేవి, నాగూల్‌మీరా పాల్గొన్నారు.

రాజగోపాల్‌కు ఆర్యవైశ్యుల సన్మానం

కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) ఖమ్మం జిల్లా న్యాయాధికారి రాజగోపాల్ తెలంగాణ రాష్ట్ర న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘం నాయకులు కలిసి శాలువలతో సత్కరించారు. న్యాయ విధాన రంగంలో ఉన్నత శిఖరాలను మరింతగా రాణిస్తూ సేవలు అందించాలని ఆకాంక్షించారు. రాజగోపాల్‌ను కలిసి సన్మానించిన వారిలో సంఘం జిల్లా నాయకులు మేళ్ల చేరువు వెంకటేశ్వరరావు, పాలువాయి వెంకటేశ్వరరావు, సీతారాములు, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలకు ముస్తాబైన మధిర

మధిర రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19,20తేదీల్లో మధిరలోని రెడ్డి గార్డెన్‌లో జరుగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఖమ్మంజిల్లా 23వ మహాసభలకు మధిర పట్టణం ముస్తాబైంది. పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా సభను జయప్రదం చేయాలని బుధవారం పార్టీ శ్రేణులు మధిర మండలం ఆత్కూరు రింగ్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో నగరాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు మాట్లాడుతూ.. హక్కుల కోసం వందేళ్లుగా సుదీర్ఘమైన పోరాటాలను నడిపించిన సీపీఐ వందేళ్ల స్ఫూర్తితో ఖమ్మంజిల్లా మహాసభలను జయప్రదం చేయడం కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యారని పేర్కొన్నారు. సీపీఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, నాయకులు ఎంఏ.రహీం, తలారి రమేష్, జల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, కొండూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెంలోని డీసీసీబీ బ్యాంకులో పెద్దగోపవరం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యుడికి బీమా నగదును బుధవారం అందించారు. సొసైటీ పరిధిలోని సహకారసంఘ సభ్యులైన బనిగండ్లపాడు గ్రామానికి చెంది అన్యం రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు పెద్దగోపవరం సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల బీమా నగదును రాంబాబు భార్య అన్యం రమ్యకు సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి అందించారు. ఈ సందర్భంగా కుటుంబానికి సానుభూతి తెలిపారు. డీసీసీబీ మేనేజర్ దివ్య, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జీరో బ్యాలెన్స్ ఖాతాలను పునరుద్ధరించుకోవాలి

- ఆర్బీఐ ఎల్‌డీవో

తల్లాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద తెరిచిన వినియోగంలో లేని జీరో బ్యాలెన్స్ ఖాతాలను పునరుద్ధరించుకోవాలని ఆర్బీఐ ఎల్‌డీవో చేతన్ గోరకర్ సూచించారు బుధవారం మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో జరిగిన జన సురక్ష అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాసత్య కేంద్రాల ద్వారా జన సురక్ష కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాలు లేని వారు వెంటనే ఖాతా తెరిచి జన సురక్ష ఇన్సూరెన్సు పథకంలో తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచే ప్రధానమంత్రి జీవనోజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి తెలుసుకుని ఖాతాదారులు ప్రీమియం చెల్లించి వీటిలో చేరి ఆర్థిక ప్రయోజనం పొందాలని కోరారు. ఖమ్మం ఎల్‌డీఎం ఎ.రవిప్రసాద్, మేనేజర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక అధికారుల పాలనలో అస్తవ్యస్తం'

కొణిజర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామాలలో ప్రత్యేకాధికారుల పాలన వచ్చిందని, వారు కనీసం గ్రామాలకు వెళ్లడం లేదని.. దీంతో గ్రామాలలో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారిందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళపల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం గ్రామ సమస్యలపై సర్వే చేశారు. అనంతరం సమస్యలపై పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేసి వినతిపత్రం అందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌వో కళావతిబాయి

సత్తుపల్లిరూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి సూచించారు. సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో వైద్య సేవలందిస్తున్న కంటైనర్ మొబైల్ యూనిట్‌ను పరిశీలించారు. ఉద్యోగులు, సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధుల పట్ల సమీక్ష నిర్వహించారు. మిగతా శాఖలతో సమన్వయంతో ఉంటూ పారిశుధ్య పనులు నిర్వహించాలని, దోమల నివారణకు ఫాగింగ్, మురుగుకాల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయడం, అంగన్‌వాడీలు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. నీరు శుభ్రంగా ఉంటే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎక్కువశాతం అరికట్టవచ్చుని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త, డ్రైనేజీలు పొంగిపొర్లడం లాంటివాటిని గుర్తించి శానిటైజేషన్ చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.టీ.సీతారామ్, గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, సిబ్బంది ఉన్నారు.